క్లుప్తంగా

నేడు శ్రీరామవరంలో ఎమ్మెల్యే సమీక్ష

దెందులూరు : శ్రీరామవరంలోని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని నివాసంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. మండల స్థాయి జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమీక్ష జరిపి వారికి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్



పెదవేగిలో డ్రోన్ ద్వారా భూమి రీ సర్వే ప్రారంభిస్తున్న తహసీల్దార్ ఎన్ నాగరాజు

పెదవేగి : రీ సర్వేతో దీర్ఘకాలిక భూసమస్యలకు చెక్ పెట్టడం జరుగుతుందని తహసీల్దార్ ఎన్. నాగరాజు అన్నారు. జగనన్న భూ హక్కు భూ రక్షణలో భాగంగా, పెదవేగి గ్రామంలో మంగళవారం రీసర్వే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పెదవేగి మండలంలో సుమారు 15 రోజుల పాటు డ్రోన్ పై కార్యక్రమం జరుగుతుందని జీసీపీ టీం కోఆర్డినేటర్ బ్రహ్మారెడ్డి వివరించారు. కార్యక్రమంలో మండల సర్వేయరు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

దెందులూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సాయిబాబా ఆలయం 10వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు రవికుమార్, అర్చకుల ఆధ్వర్యంలో సాయిబాబాను వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయినామస్మరణ, ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సొసైటీ సభ్యుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సొసైటీ అధ్యక్షుడు రాజశేఖర్

పెదపాడు : స్థానిక విశాల పరపతి సంఘంలో సంఘ సభ్యులకు అన్నివిధాలా తోడ్పాడు అందిస్తున్నట్లు పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ తెలిపారు. మండలంలోని తోటగూడెం గ్రామంలో సొసైటీ సభ్యుడు నూకల నాంచారయ్య ఇటీవల మరణించాడు. అతని కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం సోమవారం అందించారు. సంఘం సీజీఎఫ్ నిధుల నుంచి ఈ ఆర్థిక సాయం అందిస్తున్నట్లు రాజశేఖర్ చెప్పారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి దుగ్గిరాల వెంకట సబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

15, 17 తేదీల్లో ఇంటర్ పరీక్షలు

ఉంగుటూరు: ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఈ నెల 15, 17 తేదీలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న నైతికత - మానవ విలువలు అంశంపై, అలాగే 17న పర్యావరణ విద్య సబ్జెక్టులపై పరీక్షలు జరుగుతాయన్నారు. జంబ్లింగ్ పద్ధతిలో జరిగే ఈ పరీక్షలకు తమ కళాశాల నుంచి 93 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఇంటర్మీడియట్ విద్యామండలి నుంచి ఆన్లైన్లో ఈ పరీక్ష జరిగే రోజు ఆయా కళాశాలల లాగిన్లకు పరీక్ష పత్రాలను పంపిస్తారన్నారు. థియరీ పరీక్షకు 60 మార్కులు, ప్రాజెక్టు వర్కుకు 40 మార్కులు కేటాయించారని, థియరీలో 35 మార్కులు ఉత్తీర్ణత ఉంటుందని, ఈ పరీక్షలకు తప్పనిసరిగా హాజరై ఉత్తీర్ణులు కావాలని వివరించారు.

వంట సామగ్రి అందజేత



హైస్కూల్కు అందజేసిన వంట పాత్రలు

కొయ్యలగూడెం : మండలంలోని రాజవరంలో ఉన్న వీఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథక నిర్వహణకు అవసరమైన వంట సామగ్రిని దాతలు సోమవారం అందజేశారు. ఇదే పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్గా (ఇంగ్లీష్) పనిచేసిన సంగడాల ప్రసాద్ జ్ఞాపకార్థం, ఆయన సతీమణి సంగడాల సుధారాణి రూ: 32 వేల విలువైన వంటసామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.రవికుమార్ పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- కె.కన్నాపురంలో పల్లెనిద్ర. గడపగడపకు మన ప్రభుత్వం



కె.కన్నాపురంలో ఓ మహిళకు పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి: రాష్ట్రంలో పేదరికం లేని సమాజ నిర్మాణమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి లక్ష్యమని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ఆదివారం రాత్రి పెదవేగి మండలం కె.కన్నాపురంలో ప్రజలతో మమేకమై స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోనే పల్లెనిద్ర చేసి సోమవారం ఉదయం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ లబ్ధిదారులకు కర పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో అమలు కానన్ని సంక్షేమ పథకాలు సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డిని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని అబ్బయ్యచౌదరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మరింత పక్కాగా అమలుకోసమే..

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో అమలు తీరు తెలుసుకోవడం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు వారికి పథకాల ద్వారా కలుగుతున్న ప్రయోజనం తెలుసుకోమని జగనన్న పంపాడని ఆయన వెల్లడించారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థులతో ముచ్చటించారు. మీకు పుస్తకాలు, పెన్నులు, దుస్తులు, బూట్లు, బెల్టు, టై ఎవరు ఇచ్చారని చిన్నారులను ప్రశ్నించగా... జగన్ మామయ్య అంటూ విద్యార్థులు సమాధానం చెప్పడంతో ఎమ్మెల్యే వారిని అభినందించారు. బాగా చదువుకుని మంచి ఉద్యోగాలు సాధించాలని, తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఏ విధమైన సమస్య వచ్చినా తనకు నేరుగా తెలియజేస్తే సమస్య పరిష్కరిస్తారని ఎమ్మెల్యే గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్బాబు, ఎంపీపీ తాతా రమ్యకుమార్. ముండూరు సొసైటీ అధ్యక్షుడు చెరుకూరి ప్రసాదరావు, సప్పా మోహనమురళి, ముస్సె శ్రీను, బలుసు మునికుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్, బొల్లి లక్ష్మణరావు, మారగాని సత్యనారాయణ, కట్టా నాగరాజు, ముత్యాల గణపతి, చినాల సత్యనారాయణ, కమ్మిలి నాగేంద్ర, మారగాని రామకృష్ణ, కమ్మిలి వెంకటరత్నం, చిలుకూరి రాంబాబు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

మల్టీ డ్రగ్ థెరపీతో కుష్టు నివారణ



కుష్టువ్యాధిగ్రస్తులకు దుస్తులు, పండ్లు అందజేస్తున్న దాతలు, వైద్య సిబ్బంది

గణపవరం: కుష్టువ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఎవరికైనా కుష్టు లక్షణాలు కనిపిస్తే వెంటనే పీహెచ్సీ సిబ్బందికి తెలియజేయాలని గణపవరం నోడల్ పర్సన్ నామాలరాజు అన్నారు. పిప్పర పీహెచ్సీ పరిధిలోని కాశిపాడు గ్రామంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్లో భాగంగా నిర్వహిస్తున్న కుష్టు నిర్మూలన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం పీహెచ్సీ సబ్సెంటర్ వద్ద జరిగింది. ఈ సందర్భంగా కుష్టువ్యాధి గుర్తింపు, వ్యాధి నిర్మూలనపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్టును ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స ద్వారా నయం చేయవచ్చన్నారు. కుష్టు వ్యాధికి మల్టీడ్రగ్ థెరపీ ఒక్కటే మార్గమని, ఇది ప్రభుత్వ వైద్యశాలల్లో మాత్రమే అందుబాటులో ఉందన్నారు. ఆరునెలలు చికిత్స తీసుకుంటే కుష్టును అదుపుచేయవచ్చునన్నారు. ఎవరికైనా శరీరంపై రాగిరంగు మచ్చలు ఉండి, స్పర్శలేకుండా ఉంటే వెంటనే తమసిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఒళ్లు తిమ్మిర్లు, కాళ్లచేతులు మంట తదితర లక్షణాలు ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తెలియచేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో సర్వే నిర్వహించి, ఎవరికైనా కుష్టువ్యాధి లక్షణాలు ఉన్నాయా అన్నది పరిశీలించారు. చిలకంపాడులో పిప్పర పీహెచ్సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విద్యార్థులకు కుష్టు లక్షణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, విద్యార్థులతో కుష్టు నిర్మూలనలో భాగస్వాములం అవుతామని ప్రతిజ్ఞ చేయించారు. భీమవరానికి చెందిన పెన్మెత్స సుబ్బరాజు కుష్టువ్యాధిగ్రస్తులకు నూతన వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు జంపన పద్మావతి, ఉపాధ్యక్షుడు జి.బాలరాజు, సొసైటీ కార్యదర్శి రామకృష్ణంరాజు, పంచాయతీ కార్యదర్శి ఆర్డీ రామారావు, హెచ్ఎంలు బి.కాంతిశ్రీ, రంగనాయకులు, జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్కే పరమేశ్వర్లు, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువ కలుషితంపై చర్యలు తీసుకోండి



గణపవరం తహసీల్దార్కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

గణపవరం: మూడు గ్రామాల ప్రజలకు తాగునీరు, వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న ఎ.గోపవరం పంటకాలువను కాలుష్యం బారి నుంచి రక్షించాలని ఆయా గ్రామాల పరిధిలోని ప్రజలు, రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రైతులు గణపవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి, తహసీల్దార్ కృష్ణస్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పంటకాలువ సరిహద్దులో ఉన్న చేపలు, రొయ్యల చెరువుల నుంచి కలుషిత నీటిని ఆయా చెరువుల యజమానులు పంటకాలువలోకి వదిలివేస్తున్నారని ఆరోపించారు. ఈ నీరు పంట పొలాలలోకి చేరి భూములు చౌడుబారి పంటలు ఎండిపోతున్నాయన్నారు. పంట కాలువ పక్కనున్న చెరువుల అనుమతులు రద్దు చేసి వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. దీనికితోడు వంతులవారీగా పంట కాల్వకు నీరు వదులుతుండగా ఆక్వా చెర్వులకు నీటిని పెద్దపెద్ద మోటార్లు వేసి అక్రమంగా తోడివేస్తుండటంతో పొలాలకు నీరు అందడం లేదన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సరిపల్లె, కొత్తపల్లి దుర్గమ్మ ఆలయం వద్ద నుంచి రైతులు ప్రదర్శనగా వచ్చి ధర్నా నిర్వహించారు. అనంతరం స్పందనలో ఫిర్యాదు చేశారు. రైతు సంఘం నాయకుడు ఆర్వీఎస్ రాజు, రైతులు పాతపాటి సీతారామరాజు, మద్దాల గోపాలం, బండారు శ్రీనివాస్, ముద్దక వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

680 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: కంటి సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని, బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం ద్వారా కంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని పిప్పర పీహెచ్సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. సోమవారం పిప్పర ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పీహెచ్సీ ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేస్తామన్నారు. సీహెచ్వో జాలాది విల్సన్ మాట్లాడుతూ కంటి ఆరోగ్యానికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారంపై విద్యార్థులకు వివరించారు. ఎక్కువగా ఎ-విటమిన్ లభించే ఆకుకూరలు, పాలు, గుడ్లు, క్యారెట్ వంటి ఆహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు, ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 680 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 43 మంది విద్యార్థులకు కళ్లజోడు పడినట్లు ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్వో జాలాది విల్సన్, హెచ్ఎం గొర్రెల బాలయ్య, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాలకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఏపీడీ కే.పురుషోత్తం

దెందులూరు : ఉపాధి హామీ కూలీలు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్ సీడింగ్ చేయకపోతే వారు చేసిన ఉపాధి పనులకు సంబంధించిన కూలి సొమ్ము మంజూరు కాదని డ్వామా ఏపీడీ కే.పురుషోత్తం అన్నారు. సోమవారం స్థానిక ఉపాధి ఏఓ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రతి రోజూ 4 వేల మంది కూలీలకు ఉపాధి లక్ష్యంగా చింతలపూడి క్లస్టర్ పరిధిలో పనులు జరుగుతున్నాయన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఉపాధి కూలీలకు పని అడిగిన వెంటనే పని మంజూరు, జాబ్ కార్డు మంజూరు, ఆన్లైన్ ఆలస్యం కాకుండా చూడాలన్నారు. గ్రామంలో పంట కాలువలు, చెరువులు పూడికతీతల పనులను ఉపాధి కూలీలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పరంగా తాగునీరు, వైద్య సౌకర్యం కూలీలకు కల్పించడం జరుగుతుందన్నారు. దెందులూరు ఏపీఓ దశరథ రామ్జీ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులుంటే ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు తెలియజేయాలన్నారు.

నేడు, రేపు 'సామూహిక ఎలుకల నిర్మూలన'



ఎలుకల నిర్మూలనపై శిక్షణ ఇస్తున్న ఏఓ వెంకటేష్

ఉంగుటూరు: మండలంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని మంగళ, బుధవారాల్లో నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బాలన వెంకటేష్ చెప్పారు. ఈ మేరకు మండలంలోని వ్యవసాయ అసిస్టెంట్లకు, ఏహెచ్ఏలకు సోమవారం నిర్వహించిన శిక్షణ తరగతులలో ఏఓ మాట్లాడారు. ఈనెల 14వ తేదీన రైతులు అందరూ తమ పొలాల్లో ఎలుక బొరియలను మట్టితో మూసి వేసి ఉంచాలని సూచించారు. మూసి వేసిన కన్నాలు 15వ తేదీ ఉదయానికి తెరుచుకుని ఉంటే వాటిని ఎలుక బొరియలుగా గుర్తించి నూకలు, నూనెతో కలిపిన బ్రోమోడయోలోన్ మందును అందులో పెట్టాలని సూచించారు. మండలానికి 103 కిలోల బ్రోమోడయోలోన్ మందు 100 శాతం రాయితీపై ప్రభుత్వం అందజేసిందన్నారు. రైతులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని సామూహికంగా ఎలుకల నిర్మూల చేపట్టాలని, అప్పుడే పూర్తి స్థాయి ఫలితాలు ఉంటాయన్నారు. మండలంలో ఈ-పంట నమోదు 23,856 ఎకరాల వరకు పూర్తి చేశామని, అలాగే దీనికి సంబంధించి 9003 మంది రైతులకు గాను 4829 మంది రైతుల ఈ కేవైసీ పూర్తి చేశామని వివరించారు. మిగిలిన రైతులు ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని, అలాగే ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు.

శరవేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు



అలుగులగూడెంలో చురుగ్గా ఇళ్ల నిర్మాణాలు సాగుతున్న దృశ్యం

దెందులూరు : మండలంలో ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సోమవారం గృహనిర్మాణ శాఖ దెందులూరు మండల ఏఈ దివ్య, వర్క్ ఇన్స్పెక్టర్లు, వీఆర్ఓలు, గ్రామ కార్యదర్శులు జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అలుగులగూడెంలో ఏఈ దివ్య మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో ఆలస్యం కాకుండా విద్యుత్, రోడ్లు నిర్మాణంతో పాటు ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్ స్టోర్ చేయడానికి గోడౌన్ను సైతం స్థానికంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. లబ్ధిదారుల గృహావసరాలు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారుల పర్యవేక్షణ, ప్రోత్సాహకంతో జగనన్న ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

ఆక్వా చెరువుల్లో అక్రమ తవ్వకాలు ఆపాలి

ఏలూరు (టూటౌన్): ముదినేపల్లి మండలం దేవపూడి గ్రామంలో అక్రమంగా తవ్వుతున్న ఆక్వా చెరువుల పనులు ఆపాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. రైతు సంఘం, కౌలురైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమంలో ఏలూరు ఆర్డీవోకు సోమవారం వినతి పత్రం అందజేసారు. అనంతరం స్థానిక పవరుపేటలోని అన్నే భవన్ నందు జరిగిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. ముదినేపల్లి మండలం దేవపూడిలో 500 ఎకరాల వరి పంటకు సారవంతమైన భూములు ఉన్నాయన్నారు. ఆ భూములే గ్రామంలోని కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు జీవనాధారమన్నారు. గ్రామంలోని భూస్వాములు సారవంతమైన భూములను ఆక్వా చెరువులు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అక్రమంగా తవ్విన ఆక్వా చెరువులను ధ్వంసం చేయాలని, ఇక నుంచి చెరువుల తవ్వకాలు అనుమతులు ఇవ్వవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఉల్లంకి నాంచారయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిహెచ్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ధర్నా

జంగారెడ్డిగూడెం : ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని తూ.చ తప్పకుండా అమలు చేయాలని గిరిజనులు, గిరిజన సంఘాల నాయకులు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుట్టాయగూడెం మండలం మర్రిగూడెం గ్రామానికి చెందిన గిరిజనులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనేతర భూస్వాములు దశాబ్దాలుగా తాము సాగు చేసుకుంటున్న భూములను కబ్జా చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. గిరిజనేతరులపై చర్యలు తీసుకుని ఎల్టీఆర్ చట్టం ప్రజకారం గిరిజనులకు పట్టాలివ్వాలని, ఏజెన్సీలో 1/70 అమలు జరిగేలా చూడాలని కోరారు. ఈ మేరకు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జొన్నకూటి వెంకటేశ్వరరావు, సాలి రాజశేఖర్, సముద్రాల సుందరరావు, కాళిబాబు ఆదివాసీలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలుంటే చర్యలు

భీమడోలు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపీడీవో జీఎల్ఎన్వీ రాఘవన్ హెచ్చరించారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో 15వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకపు పనులపై ఉపాధి హామీ సిబ్బంది, సామాజిక తనిఖీ బృందం, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సోమవారం నిర్వహించిన అవగాహన సమావేశానికి ఏపీవో కె.పద్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ నిరుపేదలకు ఉపాధి కల్పించడంతో సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగి ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఈ పథకం ఎంతో గానో దోహదపడుతుందన్నారు. మండల పరిధిలో గతేడాదిలో 13 గ్రామ పంచాయతీల పరిధిలోని కూలీల వేతనాలకు గాను రూ.8,30,11,849, వివిధ పనులకు రూ.3,31,25,360 వెరసి రూ.11,61,37,209 వెచ్చించడం జరిగిందన్నారు. గ్రామాల్లో పలు అభివృద్ధి పనులతో పాటు పంట బోదెల పూడిక తొలగింపు పనులకు ఈ నిధులను వినియోగించామన్నారు. జరిగిన ప్రతి పనికి లెక్కలు సక్రమంగా ఉండాలన్నారు. గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వహించే సందర్భంలో వారికి అవసరమైన సమాచారాన్ని సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు అందించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈనెల 24న ఏలూరు డ్వామా కార్యాలయంలో మండల స్థాయి సామాజిక తనిఖీ కార్యక్రమం జరుగుతుందన్నారు. డీఆర్పీలు నాగరాజు, రామకోటయ్య, ధనలక్ష్మీ, గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అనఘాష్టమి వ్రతం

ఉంగుటూరు: బాదంపూడి దత్త బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం అనఘాష్టమీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దత్తాత్రేయుని ఉప ఆలయం ముందు జరిపిన ఈ వ్రతంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలి

ఏలూరు (టూటౌన్): టిడ్కో ఇళ్లు పాడై పోతున్నందున లబ్ధిదారులకు వాటిని అప్పగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక పోణంగిలోని టిడ్కో ఇళ్లను సీపీఎం బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ జిల్లాలో ఏలూరులో 6వేలు, నూజివీడులో 3600, జంగారెడ్డిగూడెంలో 1200 ఇళ్లు నిర్మాణాలు పూర్తయి ఉన్నాయన్నారు. వాటిని లబ్ధిదారులకు ఇవ్వకపోవడం వల్ల ఆ ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని పేర్కొన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు అధిక వడ్డీలకు తెచ్చి డబ్బులు కట్టారని గుర్తు చేసారు. ప్రభుత్వం ఇప్పటికైన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి పి.కిషోర్, నగర కమిటీ నాయకులు వైఎస్ కనకరావు, పార్టీ నాయకులు ఎస్ సత్యనారాయణ, జె.గోపి, లెనిన్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసుల సేవలు అభినందనీయం

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : పోలవరం సబ్ డివిజన్ పరిధిలో గల మండలాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసుల సేవలు అభినందనీయమని డీఎస్పీ లతా కుమారి అన్నారు. జీలుగుమిల్లి సబ్ డివిజన్ పరిధిలోని మహిళా పోలీసులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మహిళా పోలీసులు స్టేషన్ విధులు, మిస్సింగ్ కేసుల పరిష్కారంలో చక్కని తీరు కనబరుస్తున్నారని అన్నారు. సబ్ డివిజన్ క్రైమ్ మీటింగ్లు కూడా జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్లోనే నిర్వహిస్తామని చెప్పారు. దొంగతనాలు, గంజాయి రవాణా కేసులపై కూడా సమీక్షిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా బాల కార్మికులను గుర్తించి వారిని విముక్తి చేసేందుకు కూడా కృషి చేస్తున్నామని చెప్పారు. గంజాయి, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

స్పందనను ప్రజలకు చేరువ చేయాలి

జంగారెడ్డిగూడెం : స్పందన కార్యక్రమం ప్రజలకు మరింత చేరువ చేసేలా అధికారులు పనిచేయాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.ఝాన్సీ రాణి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందనలో వచ్చే ఫిర్యాదులను అర్థవంతంగా పరిష్కరించాలన్నారు. జిల్లా స్థాయి సమీక్ష సమయానికి పరిష్కారం కాని సమస్య ఉండకూడదన్నారు. అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కారాలు చూపాలన్నారు. సోమవారం నాటి స్పందనలో 13 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు. వీటిలో అధిక శాతం భూసంబంధిత సమ్యలే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనకు కృషి చేయాలి



తహసీల్దార్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

దెందులూరు : సమిష్టిగా కృషి చేస్తే సమాజంలో సాధించలేనిది ఏదీ లేదని తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య, ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి అన్నారు. సోమవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలను దేశమంతా జరుపుకుంటున్న తరుణంలో కుష్టువ్యాధిరహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. కుష్టి వ్యాధి సోకినవారిపట్ల ఎలాంటి వివక్షత లేకుండా ప్రేమతో వారిని ఆదరించాలన్నారు. తొలుత మండల అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కావ్య, ఏఈపీఆర్ రవీంద్రనాథ్ చౌదరి, ఏపీఎం వేణుగోపాల్, ఏపీఓ దశరద రాంజీ, డిప్యూటీ తహసీల్దార్ ప్రియ, వైద్య సిబ్బంది మహేష్, రమేష్ ఉన్నారు.